ఘనంగా మహావీర్ జయంతి



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ డివిజన్ మారుతీ వీధీలో గురువారం భగవాన్ మహావీర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భగవాన్ మహావీర్ చిత్రపటాన్ని వాహనంపై ఉంచి భారీ ఉరేగింపు నిర్వహించారు. మారుతీవీధిలోని సికింద్రాబాద్ జైన్ స్థానక్ నుంచి ప్రారంభమైన ఈ ఉరేగింపు మోండా మార్కెట్, సుభాష్ రోడ్డు, పాన్ బజార్, జనరల్ బజార్, ఎంజీ రోడ్డు గుండా సాగింది. సికింద్రాబాద్ జైన్ స్థానక్ చైర్మెన్ సంపత్ రాజ్ జైన్, అధ్యక్షులు గౌతమ్ చంద్ పాల్గొన్నారు.

పార్కులో నూతన సీసీ కెమెరాల ఏర్పాటు



పద్మారావునగర్: పద్మారావునగర్ పార్కులో నూతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడి బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఈసీ రావు, సలహాదారులు క్రిష్ణారావు, జీకే రావులు వెల్లడించారు. గురువారం పద్మారావునగర్ పార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకటించారు. పద్మారావునగర్ పార్కు భద్రత కోసం పార్కులో 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పనులు కూడా పూర్తి అయ్యాయన్నారు. మామిడి బాల్‌రెడ్డి ఎంబీఆర్ గ్రూప్స్ తరఫున పార్కులో సీసీ కెమెరాలను తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు.

హనుమాన్ శోభా యాత్రను విజయవంతం చేయాలి

లాలాపేట: హనుమాన్ శోభా యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ హిందూ వాహిని నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 12న లాలాపేటలో నిర్వహించతలపెట్టిన హనుమాన్ శోభా యాత్రకు సంబంధించిన కరపత్రాన్ని గురువారం లాలాపేటలోని పోచమ్మ దేవాలయం ఆవరణలో ఆవిష్కరించారు. 12న ఉదయం బైక్ ర్యాలీ, సాయంత్రం 6 గంటలకు ఓల్డ్ లాలాపేటలోని దర్వాజ మైసమ్మ ఆలయం నుంచి ఈ శోభా యాత్ర ప్రారంభమవుతుందన్నారు. హిందూ వాహిని తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యాదిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలియజేశారు.

తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేస్తాం

చిలకలగూడ: రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేస్తామని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. గురువారం సీతాఫల్‌మండి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు కుమారస్వామి, ఆకుల సంపత్, చోటా ప్రభు, కనకట్ల హరి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పాదయాత్ర

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గం మోండా డివిజన్ సాంబమూర్తి నగర్‌లో గురువారం బీజేపీ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. పార్టీ స్థాపన దివస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ కొంతం దీపిక, మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్ నాయకులు దయారాం, సత్యనారాయణ, సురేష్‌రావు, డివిజన్ అధ్యక్షులు జిత్తు గుప్తా తదితరులు కలిసి బస్తీలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు ఉపయోగించుకుంటున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను కార్పొరేటర్ కొంతం దీపిక ప్రజలకు అందజేశారు. అనంతరం సాంబమూర్తినగర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఓయూలో జాతీయ సదస్సు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలోని తెలుగుశాఖలో రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఆచార్య బిరుదురాజు శతజయంతి సందర్భంగా ఆర్ట్స్ కాలేజీలోని 133వ తరగతి గదిలో ఓయూ తెలుగుశాఖతో పాటు రాష్ట్ర ఉన్నత విద్య మండలి, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో ఆచార్య బిరుదురాజు రామరాజు సాహితీ సమాలోచనం అనే అంశం పై రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. కార్యక్రమానికి తెలుగుశాఖ అధిపతి (హెడ్) ప్రొ.సాగి కమలాకర శర్మ అధ్యక్షత వహించగా ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్ ప్రొ.ఇటిక్యాల పురుషోత్తం ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు.

విస్తరణ ఎప్పుడో?

దశాబ్దాలుగా విస్తరణకు నోచుకోని వారాసీగూడ ప్రధాన రహదారి



వారాసిగూడ ప్రధాన రహదారి

బౌద్ధనగర్: సికింద్రాబాద్ నుంచి జామై ఉస్మానియా ప్రధాన రహదారి ఇది. ప్రతి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లతో పాటు ఆర్టీసీ బస్సులు పెద్ద సంఖ్యలో తిరుగుతుంటాయి. ఇలాంటి ప్రధాన రహదారి విస్తరణ పడకేసింది. ఏళ్ల తరబడి విస్తరణ చేస్తామంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రకటనలు ప్రజలను ఊరిస్తున్నాయే తప్ప అమలుకు నోచుకోవడం లేదు. ఇలాంటి ప్రధాన రహదారి చిన్నదిగా ఉండటం, ప్రమాదకర మూల మలుపులు ఉండటంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు జరుగుతున్నాయి.

వాహనదారులకు నిత్య నరకం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి చిలకలగూడ, వారాసీగూడ, జామై ఉస్మానియా మీదుగా వాహనాల రాకపోకలు నల్లకుంట, రాంనగర్, విద్యానగర్, కోటి, దిల్‌సుక్‌నగర్, నారాయణగూడ, ఆర్టీసీ క్రాస్‌రోడ్ తదితర ప్రాంతాలకు వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు అధిక సంఖ్యలో ఈ రహదారి గుండా వెళుతుంటాయి. అయితే ఈ రహదారి కొన్ని దశాబ్దాల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా నిర్మించింది. కానీ అప్పటికీ.. ఇప్పటికీ వందల రెట్ల సంఖ్యలో జనాభా, వాహనాలు పెరిగిపోయాయి. దీంతో ఈ రహదారిలో తరచుగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. భారీ వాహనాలు వచ్చిన సమయంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. దీనికి తోడు రహదారి వెంట ఆటోలు, ద్విచక్ర వాహనాలు, తోపుడు బండ్లు పెడుతుండటంతో ఈ సమస్య మరింత జటిలంగా మారింది.

ప్రమాదకర మూలమలుపులు

ఈ రహదారిలో ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయి. సీతాఫల్‌మండి, వారాసీగూడ, టర్నింగ్ పాయింట్ హోటల్, జామై ఉస్మానియా వద్ద ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి. ఇక్కడ ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే పరిస్థితి ఉండదు. ఎదురెదురుగా ఆర్టీసీ బస్సుల లాంటి భారీ వాహనాలు వస్తే రోడ్డు మొత్తం జామ్ అయ్యే పరిస్థితి ఉంది. కొంత మంది ఇలాంటి ప్రమాదకర మలుపుల వద్ద కూడా మితిమీరిన వేగంతో వెళ్లి ప్రమాదాలకు కారణం అవుతున్నారు. వారాసీగూడ చౌరస్తాలో మూల మలుపు వద్ద ఆటోలు తిప్పవేయడం ఇక్కడ ఉండే వైన్ షాపుల ముందు ద్విచక్ర వాహనాలు పెద్ద ఎత్తున పార్కింగ్ చేస్తుండటంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే తాత్కాలికంగా ట్రాఫిక్ జామ్‌లను నివారించే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపి చాలా రోజులైంది



గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ రోడ్డు విస్తరణ కోసం ప్రతిపాదనలు పంపించాం. కానీ వెంటనే ఎన్నికలు రావడం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో అవి ముందుకు కదలని పరిస్థితి. ప్రభుత్వం దగ్గర నిధులు లేకపోవడంతో ఇప్పట్లో జరిగే అవకాశాలు కనిపించడం లేదు.

– ఎమ్మెల్యే పద్మారావు

దాసారం బస్తీలో | పనులను నిలిపివేయించిన తహసీల్దార్

అమీర్‌పేట: కోర్టు ఆదేశాలు ఉన్నాయంటూ ప్రైవేటు వ్యక్తులు సనత్‌నగర్ దాసారం బస్తీలో స్థలం స్వాధీనం చేసుకునేందుకు చేపట్టిన పనులను అమీర్‌పేట తహసీల్దార్ నిలిపి వేయించారు. అమీర్‌పేట మండలం బీకేగూడలో సుమారు 3 ఎకరాలకు పైగా స్థలం ఉంది. ప్రభుత్వ,ప్రైవేటు రంగ సంస్థల మధ్య చాలా కాలం నుండీ స్థల వివాదం నడుస్తుంది. తాజాగా కోర్టులో తమకు తీర్పు అనుకూలంగా వచ్చిందని పేర్కొంటూ ప్రైవేటు వ్యక్తులు బుధవారం సాయంత్రం స్వాధీనం చేసుకునేందుకు పనులు చేపట్టారు. పోలీసుల రక్షణ మధ్య జేసీబీలతో స్థలాన్ని చదునుచేసే పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న అమీర్‌పేట తహసీల్దార్ పద్మ సుందరి గురువారం ఉదయం దాసారం బస్తీ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ పనులు చేయిస్తున్న వారిని పిలిచి మాట్లాడారు. కోర్టు ఆర్డర్ పత్రాలు చూపించాలని అడుగగా ప్రస్తుతానికి పత్రాలు తమ వద్ద లేవని చెప్పడంతో పనుల్ని నిలిపి వేయాలని ఆదేశించారు. కోర్టు ఇచ్చిన ఆర్డర్ పత్రాలు చూపించాకే పనులు చేపట్టాలని,లేని పక్షంలో చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీంతో తాత్కాలికంగా స్థలం స్వాధీన పనులు నిలిచి పోయాయి. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ స్థలం విషయంలో చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. తాజాగా వచ్చిన కోర్టు ఆర్డర్ పత్రాలు చూపించకపోవడంతో పనుల్ని నిలిపివేశామన్నారు. పత్రాలు చూపని పక్షంలో స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన కంచెను తొలగిస్తామన్నారు.

ఓయూలో 14న అంబేడ్కర్ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 14న అంబేడ్కర్ జయంతిని నిర్వహించనున్నట్లు తెలంగాణ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫోరం (టీడీఎస్ఎఫ్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు విజయ్ నాయక్ గురువారం తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. టీడీఎస్ఎఫ్ సెక్రెటరీ రమేష్‌నాయుడు, లీగల్ ఫోరం నేత కరణ్, కోట ప్రభాకర్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల కోసం దళారులను నమ్మొద్దు



సికింద్రాబాద్ తహశీల్దార్ పాండునాయక్..

సనత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల కోసం దళారులను ఆశ్రయించవద్దని సికింద్రాబాద్ తహశీల్దార్ పాండునాయక్ సూచించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ సికింద్రాబాద్ తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే లబ్దిదారులు దళారులను నమ్మకుండా నేరుగా అధికారులు, సిబ్బందిని కలవాలన్నారు. ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు సరైన ధృవీకరణ పత్రాలు ఉంటే ఎలాంటి ఆటంకం లేకుండా తాము సర్టిఫికెట్లను త్వరితగతిన జారీ చేస్తామన్నారు. కార్యాలయం బయట కొందరు దళారులు తిష్టవేసి తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే వారిని మభ్యపెట్టి తాము ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలను త్వరగా చేయిస్తామని చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటివారిని నమ్మి నగదు ఇచ్చి ప్రజలు మోసపోవద్దని పాండు నాయక్ వెల్లడించారు. అన్ని అర్హతలు ఉన్నా ఆదాయ,కుల సర్టిఫికెట్లు ఇవ్వడానికి తమ సిబ్బంది ఎవరైనా లంచం అడిగితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. తాను అందుబాటులో లేని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా తహశీల్దార్ కార్యాలయంలో దళారులు తిష్టవేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాధితులకు తగిన పరిహారం దక్కేలా చూస్తా



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్ వల్ల ఆస్తులు కోల్పోయే వారికి తగిన పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ప్యారడైజ్– సుచిత్ర మార్గంలో ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం వల్ల ఇళ్లు కోల్పోయే సంజీవయ్యనగర్, చిన్నతోకట్టా బస్తీవాసులు ఎమ్మెల్యేను కలిశారు. రిహాబిలిటేషన్, రీ సెటిల్మెంట్ చట్టం ప్రకారం తమ నుంచి సేకరిస్తున్న ఆస్తుల మార్కెట్ వాల్యుకన్నా 4 రెట్లు పరిహారం ఇప్పించాలని కోరారు. తమ ఆస్తుల నిర్మాణ వ్యయాన్ని కూడా పరిహారంలో అదనంగా కలపాలన్నారు. ఆస్తులు పోతున్న నేపథ్యంలో తమకు మరో చోట ఇల్లు కట్టుకోవడానికి స్థలం చూపించాలన్నారు. ఆస్తులు కోల్పోతున్న వారిలో అధికంగా ఎస్సీలు ఉన్న నేపథ్యంలో చట్టంలో ఎస్సీ ల కోసం ప్రత్యేకంగా ఉన్న ప్రయోజనాలు కూడా తమకు దక్కేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎస్సీ, ఎస్టీ, బిసి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అశోక్ కుమార్, యాదవ రావు, తీరత్ కుమార్, హరికృష్ణ ఉన్నారు.

వర్గీకరణలో మాలలకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో మాలలకు అన్యాయం జరిగిందని మాల యూత్ ఫెడరేషన్ అధ్యక్షులు మాందాల భాస్కర్, మాల స్టూడెంట్ జేఏసీ అధ్యక్షులు మాదాసు రాహుల్ ధ్వజమెత్తారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట విలేకరులతో మాట్లాడారు. 30 లక్షలకు పైగా ఉన్న మాలల జనాభాను తక్కువ చూపారని, ఏక సభ్య కమిషన్లో లోపాలు ఉన్నాయని, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఎస్సీ వర్గీకరణ బిల్లును సమీక్షించకుండా ఆమోదించారని మండిపడ్డారు. కార్యక్రమంలో దిలీప్, రమేష్, రవి, అంజీ, శ్రీకాంత్, నిఖిల్, టింకు, సాయి, నరేష్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

అడ్డగుట్ట: స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైంది. లాలాగూడ ఎస్ఐ నాగరాణి తెలిపిన మేరకు.. లాలాపేటలోని సాయిబాబా ప్రాంతానికి చెందిన సుభాష్ గౌడ్ కుమార్తె మానస(19)ప్రైవేటు కాలేజీలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. అస్తమానం ఫోన్లో మాట్లాడుతుందని ఈ నెల 7న తండ్రి అమెను మందలించాడు. ఈ క్రమంలో అదే రోజు రాత్రి 8గంటల సమయంలో తన ఇంటి సమీపంలో ఉండే స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్ళి మళ్లీ తిరిగి రాలేదు.దీంతో మానసకు తండ్రి ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది.పరిసర ప్రాంతాలలో ఎంత వెతికిన అచూకి లభించకపోవడంతో స్థానిక లాలాగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శాంతియుత వాతావరణంలో వేడుకలను జరపాలి

సనత్‌నగర్: శాంతియుత వాతావరణంలో హనుమాన్ జయంతి వేడుకలను జరుపుకోవాలని మహంకాళి ఏసీపీ సైదయ్య సూచించారు. ఈ నెల 12న జరగనున్న హనుమాన్ జయంతి ఉత్సవాల దృష్ట్యా గురువారం మహంకాళి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్ అధ్యక్షతన ఉత్సవ కమిటీ నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే ర్యాలీలు, ఊరేగింపులు, స్వాగత వేదికలు, ప్రసాద పంపిణీ కేంద్రాల వద్ద పోలీసు నిఘా ఉంచినట్లు ఈ సందర్భంగా ఏసీపీ సూచించారు. అల్లర్లు సృష్టించేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఉత్సవాలు శాంతియుతంగా, సజావుగా జరిగేలా ఉత్సవ కమిటీ నిర్వాహకులు సహకరించాలన్నారు.


విమర్శలు కాదు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న స్టాలిన్ కృష్ణవేణి

లాలాపేట: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇటీవల చేపట్టిన దీక్షపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం కాదని.. వెంటనే పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనీ సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్టీ మహిళా ఇంచార్జి స్టాలిన్ కృష్ణవేణి డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అర్ధరహితమైన విమర్శలు, ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. కవిత చేస్తున్న బీసీ ఉద్యమానికి బీఆర్ఎస్ మహిళా విభాగం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు.


వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన రాజు

చిలకలగూడ : చిలకలగూడ ఠాణా పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. చిలకలగూడ దూద్‌బావికి చెందిన రాజు (48) భవనాలకు పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. మద్యానికి బానిసైన రాజు గత ఆరునెలలుగా మద్యం తాగకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈనెల 3వ తేది ఉదయం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో భార్య నిర్మల గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపారు.

మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి అదృశ్యం



అంటోని

అడ్డగుట్ట: మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. తుకారం గేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. అడ్డగుట్ట కమ్యూనిటీ హాల్ సమీప ప్రాంతానికి చెందిన ఆంటోని(46)కి మతిస్థిమితం సరిగా లేదు. ఈ నెల 7న ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లాడు. తిరిగి రాకపోవటంతో అతని కుటుంబ సభ్యులు తెలిసిన వారిని వాకబు చేసిన ఫలితం లేకుండా పోయింది. దీంతో అతని భార్య పుష్ప గురువారం తుకారం గేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల జోలికి వస్తే సహించేది లేదు: ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: పేదల జోలికి వస్తే సహించేది లేదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. సనత్‌నగర్‌లోని దాసారంబస్తీలో సుమారు 300 కుటుంబాలు గత 30 సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. బుధవారం కొందరు వచ్చి గుడిసెలు ఖాళీ చేయాలని హెచ్చరించారు. దీంతో ఆందోళనకు గురైన వారు గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎన్నో సంవత్సరాల నుంచి తాము ఇక్కడే ఉంటున్నామని, ఇప్పుడు తమను వెళ్లిపోవాలంటే ఎక్కడి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మార్వో, టౌన్‌ప్లానింగ్, ఇన్‌స్పెక్టర్‌లతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. పేదల జోలికి రాకుండా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ఎమ్మెల్యేను కలిసిన దాసారం బస్తీ నివాసితులు

సేవలో పోటీపడటం అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ నేతలు సేవలోనూ పోటీ పడుతూ ఉండటం అభినందనీయం అని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఐదోవార్డు వాల్మీకీ నగర్‌లో స్థానిక మహిళా నాయకురాలు వైష్ణవి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను శ్రీగణేశ్ ఫౌండేషన్ ద్వారా కొన్నేళ్లుగా కంటోన్మెంట్ వ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తూ వచ్చానన్నారు. ఈ సారి వార్డుల వారీగా స్థానిక నేతలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కంటోన్మెంట్‌లో తాగునీటి బోర్‌వెల్స్ నిర్వహణ తమ వల్ల కాదంటూ కంటోన్మెంట్ అధికారులు చేతులెత్తేయడం దారుణం అన్నారు. ప్రత్యేక నిధులు రాబట్టి అయినా, పేదలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత బోర్డుపై ఉందన్నారు. కంటోన్మెంట్‌లో ఉచిత మంచినీటి పథకానికి సంబంధించి ప్రతీ నెలా రాష్ట్ర ప్రభుత్వం రూ.80 లక్షల మేర సబ్సిడీ ఇస్తోందన్నారు. కనీసం బోర్‌వెల్స్ బిల్లులు కట్టలేమంటూ అధికారులు చెప్పడం ఏంటన్నారు.

‘ఒకే దేశం–ఒకే ఎన్నిక’ విధానంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న వెల్లాల రామ్మోహన్ తదితర నాయకులు

సనత్‌నగర్: ఒకే దేశం–ఒకే ఎన్నిక విధానంపై గురువారం బీజేపీ ఆధ్వర్యంలో సనత్‌నగర్ దాసారం బస్తీలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆ పార్టీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ మాట్లాడుతూ.. ప్రజాధనం వృథా కాకుండా పరిపాలనలో వేగం పెరుగుతోందన్నారు. దేశంలో ఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండడంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. నిరంతరం ఎన్నికల వల్ల దేశంపై ఆర్థిక భారం పడుతుందన్నారు. దేశం మొత్తం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం వల్ల డబ్బు, సమయం చాలా ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దయానంద్, శ్రీశైలంగౌడ్, లింగంపల్లి నర్సింగరావు, ఆకుల మహేష్, కన్నూరి క్రాంతికుమార్, చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే మున్నూరు కాపుల లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మున్నూరు కాపు మహిళా ప్రతినిధులు

కంటోన్మెంట్: రాజ్యాధికారమే లక్ష్యంగా మున్నూరు కాపు మహిళలు కృషిచేయాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహిళా అధ్యక్షురాలు బండి పద్మ అన్నారు. బోయిన్‌పల్లిలోని రాజరాజేశ్వరి గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ త్వరలోనే 10 లక్షల మందితో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మున్నూరు కాపు సింహ గర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం జలవిహార్‌లో నిర్వహించే మున్నూరు కాపు రాష్ట్రస్థాయి ప్రతినిధుల సమావేశంలో సభ తేదీని ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశానికి మున్నూరు కాపు మహిళా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన నేపథ్యంలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్నూరు కాపు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, ప్రతినిధులు పోకల నిర్మల, ఉపాధ్యక్షురాలు అరుణ పాల్గొన్నారు.

ఓయూలో బంద్ సంపూర్ణం

ఉస్మానియా యూనివర్సిటీ: కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ రాష్ట్రంలోని 12 వర్సిటీలలో నిరవధిక సమ్మె చేయనున్నట్లు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేత డా.సీమర్ల విజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముట్టడి సందర్భంగా అధ్యాపకుల అరెస్టును నిరసిస్తూ గురువారం ఓయూతో పాటు ఇతర వర్సిటీల్లో చేపట్టిన బంద్ సంపూర్ణంగా జరిగినట్లు తెలిపారు. నేడు (11న) రాష్ట్రంలోని 12 వర్సిటీలలో నిరసన ర్యాలీలు చేపట్టనున్నట్లు చెప్పారు.

‘స్లాట్’ విధానం సక్సెస్

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం అమలు..
- ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు 15–20 నిమిషాల సమయం..
- గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి నుంచి విముక్తి..

సనత్‌నగర్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో బేగంపేట పాటిగడ్డలోని వల్లభ్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సైతం స్లాట్ బుకింగ్ విధానంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలైంది. ప్రతిరోజూ పదుల సంఖ్యలో జనం వచ్చి రిజిస్ట్రేషన్ కోసం పడిగాపులు కాసే పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో ఒక్కో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడానికి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. స్లాట్ బుకింగ్ విధానం అందుబాటులోకి రావడంతో నిర్ణీత సమయం ప్రకారం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరుకుని నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. వల్లభ్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తొలి రోజు 17 స్లాట్ బుకింగ్‌లు కాగా, 13 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఒక్కొక్కరికీ 15–20 నిమిషాల వ్యవధిలోనే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికావడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నుంచి విముక్తి పొందారు. మొదటి రోజు స్లాట్ బుకింగ్ విధానం అమలు తీరును స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ సైదిరెడ్డి, టీఎన్జీఓస్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్ఎం హుస్సేనీ (ముజీబ్), సబ్‌రిజిస్ట్రార్ ఎంఏ ముజీబ్‌లు పరిశీలించారు. వల్లభ్‌నగర్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ మదన్‌రాజ్‌ను స్లాట్ బుకింగ్ విధానం తీరును, రిజిస్ట్రేషన్ ప్రక్రియకు పట్టే సమయాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విధానంలో రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారు గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసుకుని వెళ్లిపోవచ్చన్నారు.



డాక్యుమెంట్లను అందజేస్తున్న హైదరాబాద్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఇన్ సైదిరెడ్డి తదితరులు